సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



పోస్టులు అమ్మేశారు

నైరా వ్యవసాయ కాలేజీలో రోజువారీ కూలీల పోస్టులు అమ్మేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- 8లో



పోలీసుల ఇంటికే కన్నం

జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీలో దొంగలు రెచ్చిపోయారు. రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు.

- 8లో

మాజీ మంత్రి గుండకు అస్వస్థత

శ్రీకాకుళం: శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈయనకు మెదడులో రక్తనాళాలు చిట్లడం వల్ల రక్తం గడ్డకట్టినట్లు వైద్యులు గుర్తించారు. మందులతో ఇది నయం కాకపోవడంతో బుధవారం విశాఖపట్నం కేర్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స జరిపారు. ఆయన నెమ్మదిగా కోలుకుంటారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

న్యూస్‌రీల్

స్వాభిమాన్ ప్రత్యేక గ్రీవెన్స్ 27కి వాయిదా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నేడు జరగాల్సిన విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమం నాల్గో శుక్రవారం 27వ తేదీన నిర్వహిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ తాత్కాలిక వాయిదాను (తేదీ మార్పును) విభిన్న ప్రతిభావంతులు గమనించాలని కోరారు.

దేని 'దారి' దానిదేనంటూ..



తడిగా ఉన్నప్పటికీ రోడ్డు వేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: సాధారణంగా వర్షం పడే సందర్భాల్లో నిర్మాణ పనులు ఆపుకుంటారు. రోడ్ల వంటివాటి జోలికే వెళ్లరు. కానీ గురువారం కోటబొమ్మాళి–కొత్తపేట మెయిన్ రోడ్డు తారు నిర్మాణాన్ని వర్షం పడినా ఆపకుండా కొనసాగించడం ఆశ్చర్యపరిచింది. కొత్తమ్మ తల్లి జాతర కోసం వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు ఈ తారు రోడ్డును వేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కూడా వర్షం పడిన రోజు తారు రోడ్డు వేయకూడదు. నీటి తడికి తారు సరిగా అంటక ఊడిపోయే అవకాశం ఉంటుంది. కానీ ఇక్కడ మధ్యాహ్నం వరకు వాన పడినా అవేమీ పట్టించుకోకుండా ఆగమేఘాలపై అధికారులు కాంట్రాక్టర్‌తో పనులు చేయించేశారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



సందీప్‌కుమార్ మృతదేహం

కాశీబుగ్గ: పలాస జాతీయ రహదారిలో మొగలిపాడు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హిమాచల్ ప్రదేశ్‌లోని వీఆర్ఎల్ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన సందీప్ కుమార్(40) అనే లారీ డ్రైవర్ మృతి చెందాడు. జీడిపప్పు రవాణా చేయడానికి లారీతో పలాస వచ్చిన సందీప్ బహిర్భూమికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొట్టి మరణించాడు. మృత దేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల వద్ద ఆకతాయిల హల్‌చల్



వజ్రపుకొత్తూరు జూనియర్ కళాశాల, హైస్కూల్ వద్ద పరిస్థితి

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో గల వజ్రపుకొత్తూరు జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద కొంత మంది ఆకతాయిలు హల్ చల్ చేస్తున్నారు. కళాశాల, పాఠశాలలు విడిచిపెట్టే సమయానికి కొంత మంది ద్విచక్ర వాహనాలపై వచ్చి బాలికలను ఈవ్ టీజింగ్ చేస్తూ వికృత చేష్టలకు పాల్పడుతున్నారని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువకులతో పాటు మైనర్లు కూడా ద్విచక్ర వాహనాలపై అతి వేగంతో రోడ్లపై చక్కెర్లు కొడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. స్కూళ్లు, కాలేజీలు విడిచిపెట్టే సమయాల్లో ఇలా చేస్తుండడంతో ఏ ప్రమాదాలు జరుగుతాయోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు స్పందించి ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని వారు కోరుతున్నారు.

ఘనంగా విశ్వకర్మ పూజలు



విశ్వకర్మ పూజలు చేస్తున్న సంఘ సభ్యులు

పాతపట్నం: స్థానిక రైల్వే ట్రాక్ సమీపంలో విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో భాగంగా గత మూడు రోజులుగా విశ్వకర్మ హోమాలు, పూజలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి రవి, సంఘం సభ్యులు డి.కామరాజు, డి.శంకర్, పి.చలపతిరావు, ఆర్.జియాన్నా, ఆర్.ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆ మాటలేమయ్యాయి బాబూ?



కూటమి ప్రభుత్వం రాగానే మత్స్యకారులకు సంబంధించిన జీఓ 217రద్దు చేస్తాం. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తాం. కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు చేస్తాం. జీడి పిక్కల 80కిలోల బస్తా మద్దతు ధర రూ. 16వేలు చేస్తాం. ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. వంశధార కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులు చేస్తాం. పలాసలో రైతు బజారును ఏర్పాటు చేస్తాం.
– ఏప్రిల్ 15న పలాసలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు చేసిన ప్రసంగమిది..



అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతుకు రూ.20వేల ఆర్థిక సాయం అందజేస్తాను. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కి ఇస్తాం. రాయితీపై ట్రాక్టర్లు, యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తాను. ఏటా 4లక్షలు చొప్పున ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఉచిత ఇసుకతో నిర్మాణ రంగాన్ని నిలబెడతాం. వలంటీర్ల జీతాలు రూ.10వేలు చేస్తాం. పింఛన్ల పంపిణీపై ఆంక్షలు లేకుండా చేస్తాం. ఉద్యోగులకు మెరుగైన పీఆర్‌సీ ఇస్తాం.
–ఏప్రిల్ 23న టెక్కలి, శ్రీకాకుళం ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలివి.




అధికారంలోకి రాగానే పాతపట్నం నియోజకవర్గంలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తాను. ఇక్కడే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం, 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తాం. ఆమదాలవలస నియోజకవర్గంలో పురుషోత్తపురం వద్ద వంశధార నదిపై, ముద్దాడపేట వద్ద నాగావళి నదిపై వంతెనల నిర్మాణాలు పూర్తి చేస్తాం. నారాయణపురం ఆనకట్ట ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తాం. వంశధార ప్రాజెక్టును పూర్తి చేసి నిర్వాసితులకు న్యాయం చేస్తాం.
– ఏప్రిల్ 23న పాతపట్నం, ఆమదాలవలసలో చంద్రబాబు చేసిన వాగ్దానాలివి..



మా ప్రభుత్వం ఏర్పాటు కాగానే వంశధార, నాగావళి నదులను అనుసంధానం చేస్తాం. పలాసలో డిఫెన్స్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. నరసన్నపేట పరిధిలో ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తాం. వంశధార–బాహుదా నదులు అనుసంధానం చేస్తాం. కళింగ వైశ్యులను ఓబీసీలో చేర్చుతాం. టెక్కలిలో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తాం. బుడగట్లపాలెంలో మత్స్యకార జెట్టీ నిర్మాణం చేస్తాం. పలాస–కాశీబుగ్గలో రైల్వే ఫ్లై ఓవర్ పూర్తి చేస్తాం. పెట్రో ధరలు నియంత్రిస్తాం. – ఫిబ్రవరి 26న శ్రీకాకుళంలో రా కదలిరా సభలో చంద్రబాబు హామీలు



నాకు ఆడ బిడ్డలు లేరు. మీరే నాకు ఆడ బిడ్డలు. మహిళలను మహాశక్తిగా తీర్చిదిద్దే బాధ్యత నాది. మహిళలను మహారాణులను చేస్తాను. వారికోసం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తా. ప్రతి మహిళకు నెలకి రూ.1500 అందిస్తాను. చదువుకున్న ప్రతి బిడ్డకు తల్లికి వందనం కింద రూ.15వేలు ఇస్తాను. ఇంట్లో ఎంత మంది చదువుకుంటే అంతమందికి రూ.15వేలు చొప్పున అందిస్తాను. మహిళలకు ఉచిత బస్ ఆర్టీసీ ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తాను. మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా సరఫరా చేస్తాను.
–ఏప్రిల్ 24న శ్రీకాకుళంలో మహిళలతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు ప్రసంగం.





సూపర్ సిక్స్ పూచీ నాది

సూపర్ సిక్స్‌తో ప్రజల జీవితాలు మారుస్తాం. ఆడపడుచులకు అండగా నిలుస్తాం. అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్‌లో ఉన్న పథకాలన్నింటినీ అమలు చేస్తాం. చెప్పినవన్నీ అమలు చేసే పూచీ నాది. నేనే బాధ్యత తీసుకుంటా.
– జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రజాగళం సభల్లో సూపర్ సిక్స్ కరపత్రం, బ్యాగ్‌లను చూపించి లోకేష్ చేసిన ప్రసంగం.

చేసిందేమీ లేకపోయినా 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ప్రజల్లోకి వస్తున్న కూటమి ప్రభుత్వం

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు పంగనామం
- ఒక్కటంటే ఒక్కటీ అమలు చేయని పరిస్థితి
- ఆర్థిక సంక్షోభం పేరుతో కాలయాపన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఎన్నికలకు ముందు వందలాదిగా హామీ ఇచ్చిన చంద్రబాబు, లోకేష్‌లు ప్రభుత్వం ఏర్పాటు చేసి వందరోజులవుతున్నా వాటిలో ఒక్కటంటే ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదు. ప్రతి దానికీ ఆర్థిక సంక్షోభం అనే కారణాన్ని చూపించి గత ప్రభుత్వాన్ని తిడుతూ మూడు నెలలు కాలక్షేపం చేశారు. ఇన్ని రోజుల్లో చేసిందేమీ లేకపోయినా 'ఇది మంచి ప్రభుత్వం' అని మళ్లీ ప్రజల్ని మాయ చేయడానికి కొత్త అవతారమెత్తారు. ఎలక్షన్ల ముందు చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ తదితరుల ఎన్నికల ప్రచార సభల్లో ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మారు. దీనికి తోడు వారి మేనిఫెస్టోలను సొంత పత్రికల్లో ప్రకటనల రూపంలోనూ ప్రచురించారు. ఫోన్ కాల్స్‌తో హోరెత్తించారు. ఓటు వేసే ముందు వరకు ఇంత హడావుడి చేసిన నాయకులు జనం ఓటు వేశాక ఆ మాటల ఊసెత్తడం మర్చిపోయారు.



సాగుకు సాయమేదీ..?

ఖరీఫ్ మొదలై చాలాకాలమవుతున్నా రైతుకు ఇస్తామన్న రూ.20వేలు ఇంకా చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వనేలేదు. పంట పెట్టుబడులకు ఉపయోగపడే సాయాన్ని ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఇస్తేనే మేలు జరుగుతుంది. కానీ చంద్రబాబుకు రైతుల కష్టాలు పట్టడం లేదు. అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో జిల్లాలోని 3,14,212 మంది రైతులకు రూ. 1876.55కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.



నిరుద్యోగులకు టోపీ..

ఉద్యోగం లేదంటే నిరుద్యోగ భృతి అంటూ నిరుద్యోగులందరికీ ఒకేసారి బాబు టోపీ పెట్టారు. ఈ హామీపై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందడుగు పడలేదు. జిల్లాలో 7,28,210 మంది నిరుద్యోగులు భృతి కోసం ఎదురు చూస్తున్నారు.



మహిళలకు ఉచిత దగా

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అని చెప్పారు. కానీ దానిపై కనీస కసరత్తు చేసిన దాఖలా కూడా లేదు. జిల్లాలో 10,95,130మందికి ఉచిత ప్రయాణానికి అర్హులు. వీరందరికీ ఎదురు చూపులే మిగిలాయి.



50 ఏళ్లకు పింఛనేది

అధికారంలోకి వచ్చిన వెంటనే 50 ఏళ్లకే మహిళలకు పింఛన్ మంజూరు చేస్తామని చెప్పారు. దీంతో మహిళలు ఆశపడ్డారు. ఎన్నికల్లో ఓట్లేసి గెలిపించారు. కానీ, గెలిచినాక చంద్రబాబు 50ఏళ్ల పింఛన్ జోలికి వెళ్లలేదు సరికదా ఉన్న పింఛన్లు తీసేస్తున్నారు. బాబు ఇచ్చిన హామీ ప్రకారం జిల్లాలో 3,07,537 మంది 50 ఏళ్ల పింఛన్‌కు అర్హులుగా ఉన్నారు.



మహిళకు రూ.1500 ఏదీ...

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు 19ఏళ్ల నుంచి 60ఏళ్ల లోపు మహిళలకు నెలకి రూ. 1500ఇస్తామని చెప్పారు. జిల్లాలో ఈ పథకం కింద దాదాపు 7,59,692మంది అర్హులై ఉన్నారు. వీరంతా తమకు రూ. 1500ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూస్తున్నారు.



చదువుకేదీ సాయం

నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు ఇలా ఎంత మంది ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15వేలు చొప్పున ఇస్తానని ఎన్నికల్లో చంద్రబాబు ఊదరగొట్టారు. కానీ ఇప్పటివరకు పిల్లలకు రూపాయి కూడా విదల్చలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో చెప్పిన సమయానికి అమ్మ ఒడి సాయం అందేది. నాలుగేళ్లలో రూ.1334.51కోట్లు మేర తల్లుల ఖాతాలకు జమ చేశారు. తల్లికి వందనంకు అర్హులైన 3,23,019మందికి చంద్రబాబు సమాధానం చెప్పాలి.



హామీ 'గ్యాసే'నా

ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అంటూ ఎన్నికల ముందు హోరెత్తించారు. కానీ ఈ మూడు నెలల్లో దానిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్లు కోసం 7,28,210మంది ఆశగా చూస్తున్నారు.

ప్రజల కంట్లో ఉచిత ఇసుక

ఉచిత ఇసుక అని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక మాటమార్చారు. ఉచితం ముసుగులో ధర పెట్టి విక్రయిస్తున్నారు. కొనుగోలు చేద్దామన్నా ఇసుక అందుబాటులో వుంచని పరిస్థితి చోటు చేసుకుంది. ప్రస్తుతం 18టన్నుల ఇసుక లారీ ధర రూ.30వేలు దాటిపోయింది. అది కూడా టీడీపీ నాయకులు అనధికారికంగా నడుపుతున్న ర్యాంపులు, స్టాక్ పాయింట్ లో దొరుకుతున్న పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు మేలు జరగలేదు. ఈ విధానం టీడీపీ నాయకులకు మాత్రం కాసులు కురిపిస్తుంది.

జిల్లాలో ఇసుక ధరలు (18 టన్నుల లారీ) ఇలా ఉన్నాయి..

పలాస	30,500
టెక్కలి	32,000
ఇచ్ఛాపురం	32,600
ఆమదాలవలస	25,000
పాతపట్నం	25,000
నరసన్నపేట	25,500
ఎచ్చెర్ల	30,000
శ్రీకాకుళం	25,750



గతంలోనూ మోసమే..

- 2014–19లో ఇదే తరహాలో మోసం చేశారు. హామీలిచ్చి ఓట్లు వేయించుకుని గెలిచాక గాలికొదిలేశారు.
- శ్రీకాకుళం స్మార్ట్ సిటీ చేస్తామని చేయ లేదు.
- శ్రీకాకుళం నగరంలో రూ.119కోట్లతో భూగర్భ డ్రైనేజీ నిర్మిస్తామన్నారు. రూ.150కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఒక్క అడుగు ముందుకు వేయలేదు.
- నరసన్నపేటలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి హామీ ఇచ్చారు. తర్వాత గాలికొదిలేశారు.
- ఉద్దానం కొబ్బరి రైతులు, ఉద్యానవన రైతుల కోసం కొబ్బరి పరిశోధన కేంద్రం ఏర్పాటులో భాగంగా కోకోనట్ ఫుడ్ పార్క్ ఏర్పాటు చేస్తామని గాలికొదిలేశారు.



కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద నిలిచిపోయిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

- జిల్లాను పరిశ్రమల హబ్‌గా మార్చుతామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు రానున్నాయని ప్రకటించారు. సోంపేట, తీర ప్రాంతాల్లో మత్స్యకార పరిశ్రమలు పెడతామని చెప్పారు. ఒక్కటంటే ఒక్కటీ చేయలేదు.
- ఆమదాలవలసలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. దాని జోలికే పోలేదు.
- కళింగపట్నం, భావనపాడు రేవులో ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేస్తామన్నారు. కానీ చేతులెత్తేశారు.

ఎడ్ సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఎడ్ సెట్–2024 రెండో విడత కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభమైంది. జిల్లాలో 13 బీఎడ్ కళాశాలలు ఉండగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని స్పెషల్ బీఎడ్ మెంటల్లీ రిటార్డులో సైతం ఈ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ నెల 21 వరకు రిజిస్ట్రేషన్, 20 నుంచి 22 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన, 23 నుంచి 25 వరకు ఆప్షన్ల నమోదు, 26న ఆప్షన్ల మార్పు, 28న సీట్ల అలాట్‌మెంట్ ప్రకటిస్తారు.

సీనియర్లకు పెద్దపీట

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా మరోసారి ధర్మాన కృష్ణదాస్ నియామకం
- నాలుగోసారి పట్టం కట్టిన సీఎం వైఎస్ జగన్
- శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా తమ్మినేని సీతారాం నియామకం



ధర్మాన కృష్ణదాస్



తమ్మినేని సీతారాం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: సీనియర్ నేతలు, మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాంకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారు. మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా మరోసారి నియమించారు. నాలుగోసారి ఆ బాధ్యతలు చేపట్టిన నాయకుడిగా దాసన్న చరిత్ర సృష్టించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం గురువారం సాయంత్రం నియామక ఉత్తర్వులను జారీ చేసింది. అంతకు ముందు జిల్లాకు చెందిన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. పార్టీకి సంబంధించి సమీక్ష జరిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జిలు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, తమ్మినేని సీతారాం, రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, పేరాడ తిలక్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, దువ్వాడ శ్రీనివాస్ హాజరయ్యారు.

అంకిత భావం, విధేయతకు పట్టం

పార్టీ ఆవిర్భావం నుంచి ఎంతో అంకిత భావం, విధేయతతో పనిచేస్తున్న ధర్మాన కృష్ణదాస్‌ను మరోసారి జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతో పార్టీ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. కష్టకాలంలో అండగా నిలిచే నాయకుడిగా ఆయనకు పేరుంది. కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చాక వైఎస్ జగన్ వెంట నిలిచిన నేతల్లో ఒకరైన కృష్ణదాస్ పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేశారు. వైఎస్ ఫ్యామిలీకి అత్యంత ఆప్తులుగా నిలిచారు. అధికారంలోకి వచ్చాక అందుకు తగ్గ గుర్తింపును పొందారు. డిప్యూటీ సీఎంగా నియమితులై పార్టీలో తనకంటూ ముద్ర వేసుకున్నారు.

అలాగే, పార్టీలో మరో సీనియర్ నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమిస్తూ అధినేత వైఎస్ జగన్ మరోసారి గౌరవం కల్పించారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టపడి పనిచేసిన నాయకుడిగా సీతారాంకు గుర్తింపు ఉంది. ఆయన నిబద్ధతే అధికారంలోకి వచ్చాక స్పీకర్ పదవి వరించేలా చేసింది. మొత్తానికి ఇద్దరు సీనియర్ నేతల సారథ్యంలో వైఎస్సార్‌సీపీ మరింత పటిష్టం కావడమే కాకుండా ప్రజా సమస్యలపైన, ప్రభుత్వ విధానాలపై పోరాటం చేయనుంది.



వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన జిల్లా నాయకులు ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, పార్టీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్

నిలదీస్తారనే భయంతోనేనా..



- సీఎం జిల్లా పర్యటన రద్దు
- 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఆదిలోనే ప్రతికూలత
- వాతావరణం అనుకూలంగా లేదని బయటకు లీకులు
- జిల్లా మంత్రి అచ్చెన్నాయుడితో యథావిధిగా రాజపురం కార్యక్రమం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు చేపట్టే తొలి పర్యటన రద్దయ్యింది. 100రోజుల పాలనను ప్రజలకు వివరించేందుకు 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో కవిటి మండలం రాజపురం గ్రామంలో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి ఆదిలోనే ప్రతికూలత ఎదురైంది. ఏం చేశారని గ్రామానికి వస్తున్నారని, వస్తే తప్పకుండా నిలదీస్తాం అన్న స్థానికుల ఆలోచనను గమనించి చంద్రబాబు తన పర్యటనను గురువారం రాత్రి రద్దు చేసుకున్నట్టు తెలిసింది. ఒక్క పింఛన్లు తప్ప చేసిందేమీ లేదని, 100 రోజుల పాలనను ఏం వివరిస్తారని, వస్తే తమ సమస్యలు, ఎన్నికల హామీలను అడుగుతామని స్థానికుల నుంచి ఫీడ్‌బ్యాక్ రావడంతోనే పర్యటన రద్దు చేసినట్టు తెలిసింది.

హాట్ టాపిక్ ఇదే..

చంద్రబాబు 100రోజుల పాలనను పురస్కరించుకుని 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం రూపకల్పన చేసింది. తొలి కార్యక్రమం జిల్లాలోని కవిటి మండలం రాజపురంలో సీఎం చేతుల మీదుగా నిర్వహించాలని షెడ్యూల్ ఖరారు చేశారు. రెండు రోజులు హడావుడిగా, యుద్ధ ప్రాతిపదికన పర్యటన ఏర్పాట్లు చేశారు. సీఎం వచ్చాక ఎవరితో మాట్లాడాలి?, ఎవరింటికి వెళ్లాలి? స్థానికులతో ఎక్కడ సమావేశమవ్వాలి? తదితర వాటిపై ముందస్తు స్క్రిప్ట్ ప్రకారం సిద్ధం చేశారు. టూర్ షెడ్యూల్‌ను గురువారం మధ్యాహ్నం విడుదల కూడా చేశారు. ఈలోపు రాజపురం గ్రామం నుంచి ప్రతికూల ఫీడ్‌బ్యాక్ రావడంతో హుటాహుటిన సీఎం పర్యటన రద్దు చేసినట్టు తెలిసింది. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక 'ఒక్క పింఛన్లు తప్ప ఏమీ చేయలేదని, గ్రామం పరంగా గానీ, మండల పరంగా గానీ, నియోజకవర్గ పరంగా గానీ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని, వస్తే తప్పకుండా తమ సమస్యలను నిలదీస్తాం' అనే గ్రామస్తుల ఫీడ్ బ్యాక్ మేరకు సీఎం పర్యటన తప్పని పరిస్థితుల్లో రద్దు చేసుకున్నట్టు తెలియవచ్చింది. కానీ వాతావరణం కారణంగా కార్యక్రమం వాయిదా పడిందని, హెలికాప్టర్ దిగేందుకు వాతావరణం అనుకూలంగా ఉండదనే కారణంతో కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు చెప్పారు. సీఎం పర్యటన రద్దు అయినప్పటికీ రాజపురంలో మాత్రం మంత్రులతో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరగనుంది.

28న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి యువజనోత్సవాలను ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నామని సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులకు జానపద బృంద నృత్యం, జానపద బృంద గీతాలు, జానపద నృత్యం (సోలో), జానపద గీతం (సోలో)తోపాటు కవిత్వం, స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, డిక్లమేషన్ అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. శ్రీకాకుళం రూరల్‌లోని మనసబ్‌పేట గాయత్రి కళాశాల ఆడిటోరియం వేదికగా 28వ తేదీన ఉదయం 9 గంటలకు యువజన ఉత్సవాలు మొదలవుతాయని చెప్పారు. మరిన్ని వివరాలకు సెట్‌శ్రీ మేనేజర్ వివి అప్పలనాయుడు (7396219578)ను సంప్రదించాలని సీఈఓ సూచించారు.

క్లుప్తంగా

అక్టోబర్ 5న బీఆర్‌ఏయూలో స్కిల్‌టెస్ట్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న టైమ్ స్కేల్, డైలీవేజ్, కాన్సాలిడేట్ పే, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు స్కిల్ టెస్ట్ నిర్వహణకు రిజిస్ట్రార్ పి.సుజాత గురువారం ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ ఐదున ఈ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగోన్నతులకు ఈ నైపుణ్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మరో పక్క ఉన్నత విద్యా మండలి కాంట్రాక్టు ఉద్యోగుల పదోన్నతులకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. పాలక మండలి అనుమతి సైతం తీసుకోవాల్సి ఉంటుంది. అధికారులు మాత్రం నిబంధనలు పాటించటం లేదని విమర్శలు వస్తున్నాయి.

డిగ్రీ అధ్యాపకుల నిరసన



డిగ్రీ కళాశాల వద్ద నల్లబ్యాడ్జీలతో ధర్నా చేస్తున్న అధ్యాపకులు

నరసన్నపేట: రాజ్యాంగబద్ధంగా ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికైన అధ్యాపకుల అవకాశాలు, హక్కులు కాలరాయవద్దని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న ఎయిడెడ్ అధ్యాపకులను తిరిగి వారి మాతృ సంస్థలకు పంపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక డిగ్రీ కళాశాల వద్ద అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. గతంలో జీఓ నంబర్ 42 ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఎయిడెడ్ విద్యా సంస్థలను విలీనం చేయడాన్ని వీరు తప్పు పట్టారు. ఈ జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీసీజీటీఏ అధ్యాపకులు జి.రవికుమార్, అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ఆరుగురికి గాయాలు

పొందూరు: స్థానిక మేదర వీధి సమీపంలో ఆటో బోల్తా పడి ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. నక్కపేట గ్రామానికి చెందిన ఆరుగురు ప్రయాణికులు పాగిరి సన్యాసిరావు ఆటోలో చెట్టుపొదిలాం గ్రామంలో పరామర్శకు వెళ్లారు. పరామర్శ ముగించుకుని తిరిగివస్తుండగా పొందూరు పట్టణంలో మేదరవీధి సమీపంలో ఎదురుగా ద్విచక్ర వాహనం అడ్డుగా రావడంతో ఒక్కసారిగా డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా కొట్టింది. కొద్ది దూరం ఈడ్చుకుని వెళ్లడంతో ఆటోలో ఉన్న వారణాసి సంగంకు చేయివిరిగింది. ఆటోలో ఉన్న మరో ఐదుగురు మహిళలకు గాయాలయ్యాయి. ద్విచక్రవాహనదారుడికి గాయాలవ్వడంతో పొందూరు ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన వారిని 108 వాహనంలో శ్రీకాకుళం తరలించారు.

పోస్టులు అమ్మేశారు

- నైరా వ్యవసాయ కళాశాలలో రోజు వారీ కూలీల పోస్టులు విక్రయించిన టీడీపీ నేతలు
- ఒక్కో పోస్టుకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు

శ్రీకాకుళం రూరల్:

జిల్లా కేంద్రంలో గల నైరా వ్యవసాయ కళాశాలలో రోజువారీ పని కింద (టైమ్‌స్కేల్) మంజూరు చేసిన 20 పోస్టులను అమ్మేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వాస్తవంగా నైరా, అలికాం పరిధిలో గల వ్యవసాయ భూములను 1990లో ప్రభుత్వం ఓ రేటును ఫిక్స్ చేసి రైతుల వద్ద నుంచి తీసుకుంది. తీసుకున్నప్పుడు కూలీల పోస్టులు కళాశాలలో ఎప్పుడు మంజూరైనా ముందుగా భూములు ఇచ్చిన రైతులకు, అందులో పని చేసిన, పదవీ విరమణ పొందిన వారికి మాత్రమే మొదటి ప్రాధాన్యత ఇస్తామని అప్పట్లో రైతులతో ఒప్పందం కుదుర్చుకుంది. చాలాకాలంగా ఇదే ప్రక్రియ కొనసాగుతూ వస్తోంది. కానీ ఇటీవల కాలంలో కళాశాలలో మంజూరైన 20 పోస్టులను మాత్రం భూములు ఇచ్చిన రైతులకు కాకుండా స్థానికంగా నైరా, అలికాం పరిధిలో గల కొంతమంది టీడీపీ నాయకులు ఒక్కో పోస్టు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకూ బేరం పెట్టి అమ్మేశారు.

ఈ నెల 1వ తేదీ నుంచి కొత్తగా జాయిన్ అయిన కూలీలంతా రోజువారీ వేతనం చొప్పున 20 రోజులుగా నైరా వ్యవసాయ కళాశాలలో పనులు చేస్తున్నారు.



నైరా వ్యవసాయ కళాశాల



ఆ పోస్టులతో మాకు సంబంధం లేదు

నైరా వ్యవసాయ కళాశాలలో ఇటీవల 20 మంది రైతు కూలీలు పనులు చేసేందుకు చేరారు. వాస్తవంగా ఆ పోస్టులను కళాశాలలో రిక్రూట్ చేసుకొని వేయించుకోము. నైరా, అలికాం గ్రామాలకు చెందిన భూములు ఇచ్చిన రైతులు, గ్రామపెద్దల సమక్షంలోనే ఆ పోస్టులు సెలెక్షన్ చేసుకొని మాకు అందిస్తే వారిని పనిలో పెట్టుకున్నాం.

– డాక్టర్ ఎం.భరతలక్ష్మి, నైరా కళాశాల అసోసియేట్ డీన్

మాకు అన్యాయం చేశారు



మా కుటుంబ సభ్యులు సైతం నైరా వ్యవసాయ కళాశాలలో పనిచేస్తూ రిటైరయ్యారు. కానీ మా వారికి మాత్రం కూలీల పోస్టులు ఇవ్వకుండా బయటకు వ్యక్తులకు రూ.50వేలు నుంచి రూ.లక్ష వరకు తీసుకుని టీడీపీ నేతలు అమ్మేశారు. ఈ విషయంపై నేను నైరా వ్యవసాయ కళాశాలకు ఆర్టీఐ యాక్టు ద్వారా వివరాలు కావాలని లేఖ అందించాను. గడిచిన ప్రభుత్వంలో రాని పోస్టులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంజూరు చేయడంలో ఆంతర్యమేంటో చెప్పాలి.

– ఓటుపల్లి కృష్ణ, నైరా గ్రామస్తుడు

సివిల్ కేసులో పోలీసుల అత్యుత్సాహం

శ్రీకాకుళం క్రైమ్ / గార : ఓ సివిల్ కేసులో పోలీసులు అత్యుత్సాహం చూపిన ఘటన గారలో చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మంగళవారంపేటలో గత కొంతకాలంగా గుడ్ల నీలయ్య, వంజరాపు రాజన్నల మధ్య ఆస్తి తగాదా నడుస్తోంది. కోర్టులో కూడా ఈ కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నీలయ్య, అతని భార్య నీలమ్మలు నివసిస్తున్న ఇంటి వద్దకు రాజన్న కుటుంబ సభ్యులు వచ్చి గొడవ చేశారు. కాసేపటికి ఎస్ఐ జనార్దన్ సహా మూడు జీపుల్లో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఎస్ఐ దగ్గరుండి తాళాలు వేయించి రాజన్న కుటుంబసభ్యులకు అప్పజెప్పారని నీలయ్య ఆరోపిస్తున్నారు. తమ ఫోన్లు కూడా లాగేసుకున్నారని ఆయన తెలిపారు. పాత భూరికార్డుల ఆధారంగా తమకున్న పదిహేడున్నర సెంట్ల స్థలంలో గుడ్ల నీలయ్య, అతని కుమారులు ఇల్లు నిర్మించడమే కాక, వెనుక జాగాలో ఉన్న తమ గొర్రెల పాకను జేసీబీలతో గతంలో కూలదోశారని వంజరాపు రాజన్న కుటుంబసభ్యులు, కుమారులు ఆరోపించారు. దీనికి గుడ్ల నీలయ్య, వారి కుమారులు మాట్లాడుతూ తమకున్న సుమారు ఐదు సెంట్ల నిలువు జాగా (జీరా)లోనే ఇంటికి 2019లోనే పునాదులు వేసి నిర్మించుకున్నామని తెలిపారు. పక్క జాగాలో ఉన్న వంజరాపు రాజన్న కుటుంబ సభ్యులు అక్రమంగా గొర్రెల పాక వేసుకుంటే కలెక్టర్ స్పందనకు వెళ్లామని, తహసీల్దార్ వచ్చి పోలీసులు, పంచాయతీరాజ్ అధికారుల సమక్షంలో ఎస్ఎల్ఆర్ రిపోర్ట్ ఆధారంగా స్థలం తమదేనని నిర్ణయించాక పాకను తొలగించామన్నారు. దీనిపై గార ఎస్ఐ జనార్దన్ మాట్లాడుతూ ఉదయం తమకు ఫోన్ వచ్చిందని వైఎస్సార్ సీపీ వాళ్లు టీడీపీ వాళ్లు గొడవ పడుతున్నారని చెప్పడంతో తాను ఆరుగురు సిబ్బందితో వెళ్లానన్నారు. తాళాలు తాము వేయించలేదని చెప్పారు. ఫోన్లు కూడా ఎవరో వాళ్లవి విసిరేశారని ఎస్ఐ చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న గుడ్ల నీలయ్య కుటుంబం



విలేకరులతో మాట్లాడుతున్న వంజరాపు రాజన్న కుటుంబం

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు

నరసన్నపేట: టీడీపీ అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, కార్యకర్తలపై కక్ష సాధింపులు ఆగడం లేదు. తాజాగా నరసన్నపేట మండలం దూకులపాడులో ముగ్గురు యువకులపై అక్రమ కేసులు బనాయించారు. గ్రామానికి చెందిన పొన్నాన గోవిందరావు, పొన్నాన శంకరరావు, బొంగు చంద్రరావులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. సోమవారం రాత్రి గణేష్ నిమజ్జనం సమయంలో టీడీపీకి చెందిన ముద్దాడ మణికంఠ, అతని తండ్రి శిమ్మన్నలు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు డ్యాన్సులు వేస్తున్న సమయంలో అక్కడికి వచ్చి మద్యం మత్తులో గొడవ పడ్డారు. అదే సమయంలో అక్కడున్న ఇరువర్గాల పెద్దల చొరవతో గొడవ సద్దుమణిగినప్పటికీ అధికారంలో ఉన్నాం అనే గర్వంతో 'మీపై కేసులు పెట్టించి మీ అంతు చూస్తాం, సూపర్‌సిక్స్ అమలుచేయాలని స్టేటస్‌లు పెడతారా మీకు ఎంత ధైర్యం' అంటూ వైఎస్సార్‌సీపీకి చెందిన యువకులను దూషించారు. ఈ విషయంపై ఇరువర్గాలు నరసన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి. దీనిపై విచారణ జరుగుతున్న సమయంలోనే తర్వాతి రోజు రాత్రి ముగ్గురు యువకులు తమ ఇంటిపై దాడి చేశారని టీడీపీ వర్గీయులు తప్పుడు ఫిర్యాదు చేశారు. దీంతోపాటు ఫిర్యాదుదారుని కుమారుడు మణికంఠ తాను ఎంపీ కార్యాలయంలో పనిచేస్తున్నానంటూ అక్కడి నుంచి పోలీసులపై ఒత్తిడి చేశారు. దీంతో మంగళవారం అర్ధరాత్రి ముగ్గురిపై ఏకపక్షంగా కేసు నమోదు చేశారు. దీన్ని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ చైర్మన్ జీవీవీ నాయుడుతోపాటు పార్టీ నాయకులు తీవ్రంగా తప్పుపట్టారు. తప్పుడు కేసులు కట్టి యువకులపై చర్యలకు ఉపక్రమిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఇచ్చిన ఫిర్యాదుపై కూడా విచారణ చేపట్టి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



అకారణంగా కేసులో ఇరుక్కున్న దూకులపాడు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

ప్రభుత్వ ఉపాధ్యాయుని ప్రవర్తనపై ఫిర్యాదులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు వై.వెంకటరమణ విద్యార్థినులతో అనుచిత రీతిలో ప్రవర్తిస్తున్నారని, మద్యం తాగి క్లాస్‌కు హాజరవుతున్నారని, అసభ్యకర భాష ఉపయోగిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రుల పేరుతో జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పలు ఫిర్యాదులు పోస్టు ద్వారా చేరాయి. ఈ ఫిర్యాదులు ఇంకా కొనసాగడంతో డీఈఓ తిరుమల చైతన్య డిప్యూటీ డీఈఓ ఆర్.విజయకుమారిని విచారణకు పాఠశాలకు పంపించారు. ఈ నెల 17వ తేదీన ఆమె విచారణ చేశారు. విద్యార్థినులు పలు సమస్యలు ప్రస్తావిస్తూ టీచర్ ప్రవర్తన బాగోలేదని కూడా రాశారు. అయితే దీనిపై పూర్తిస్థాయి నివేదిక డీఈఓకు అందాల్సి ఉంది. అయితే డిప్యూటీ డీఈఓ విచారణ సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులను వివరణ కోరే ప్రయత్నం చేయగా వారు మాత్రం హాజరు కాలేదు. దీనిపై హెచ్ఎం శ్రీరాములు మాట్లాడుతూ గణిత ఉపాధ్యాయుని బోధన మెరుగ్గా ఉందని, కొందరు కావాలనే ఆయనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. స్కూల్‌మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ రవి వర్మ మాట్లాడుతూ డిప్యూటీ డీఈఓ విచారణ చేసేటప్పుడు కొందరు విద్యార్థులు టీచర్ ప్రవర్తనపై రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారని, విద్యార్థుల తల్లిదండ్రులు విచారణకు హాజరు కాలేదని తెలిపారు.

తిర్లంగిలో ఉద్రిక్తత



ఆక్రమణ జరిగిన ప్రాంతాన్ని మార్కింగ్ చేయిస్తున్న తహసీల్దార్



తమకు చావే దిక్కు అని పెట్రోల్ క్యాన్ చూపెడుతున్న బాధితులు

టెక్కలి రూరల్: మండలంలోని తిర్లంగి గ్రామంలో గురువారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. గతంలో ఉన్న కాలువలను కప్పి దానిపై అక్రమ నిర్మాణం చేపట్టారంటూ దాన్ని కూల్చేందుకు జేసీబీ సాయంతో ఘటన స్థలానికి రెవెన్యూ అధికారులు రావడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఈ మేరకు స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. తిర్లంగి గ్రామానికి చెందిన సాహుకారి నీలకంఠేశ్వరరావు అతని భార్య విమల గ్రామంలో గత కొంత కాలంగా గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. అయితే ఈ దుకాణం ఉన్న స్థలం ఆక్రమిత స్థలమంటూ కొందరు ఫిర్యాదు చేయడంతో గురువారం టెక్కలి తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి షాప్ కూల్చడానికి జేసీబీని తీసుకువచ్చారు. దీనిపై తమకు నోటీసు కూడా ఇవ్వలేదని నీలకంఠేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఈ దుకాణమే ఆధారమని, దాన్ని కూల్చేస్తే ఎలా అని తహసీల్దార్‌తో వాదించారు. కూల్చితే తమకు చావే దిక్కంటూ పెట్రోల్ పోసుకుని చనిపోతామని బెదిరించారు. అధికారులు మాత్రం ఆక్రమణ తొలగించాలని స్పష్టం చేయడంతో.. అధికారులు మార్క్ చేసినంత వరకు తానే స్వయంగా తొలగిస్తానని కొంత సమయం కావాలని కోరారు. దానికి తహసీల్దార్ స్పందించి రెండు, మూడు రోజులు సమయం ఇవ్వనున్నట్లు తెలిపారు. అయితే గతంలో ఓటీఎస్ పద్ధతిలో పట్టాల కోసం రూ.20 వేలు కట్టామని, అయితే అప్పుడు తమ గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శి పట్టాలు ఇవ్వడానికి లంచం అడగాడని బాధితులు వాపోయారు.

ఉపాధ్యాయుని ఇంట్లో చోరీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని పీఎన్ కాలనీ పదోలైన్‌లో ఉపాధ్యాయుని ఇంటిలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. రెండో పట్టణ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు గురువారం ఉదయం ఘటనా స్థలికి క్లూస్ టీమ్‌తో సహా వెళ్లి పరిశీలించారు. బుధవారం రాత్రి ఇదే కాలనీ మూడో లైన్‌లో కూడా రిటైర్డ్ ఉపాధ్యాయుని ఇంటిలో చోరీ జరగడం విశేషం. వివరాల్లోకి వెళ్తే.. బూర్జ మండలం కొల్లివలస ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్ రామ్మూర్తి, కోటబొమ్మాళి గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న రమాదేవిలు భార్యాభర్తలు. ఇద్దరూ కలిసి పదోలైన్‌లో నివసిస్తున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఈనెల 14న ఇంటికి తాళం వేసి బెంగళూర్ వెళ్లారు. రోజూ వాకిలి కడిగి ముగ్గు వేసేందుకు పనిమనిషి అవసరం ఉండటంతో ఆమెకు ప్రహరీ తాళం ఇచ్చి వెళ్లారు.



చిందరవందరగా బెడ్ రూం

ప్రధాన ద్వారం ఛిద్రమవ్వడంతో..

రోజూ మాదిరిగా పనిమనిషి వచ్చి గేటు తెరిచి చూసేసరికి గ్రిల్స్ ప్రధాన ద్వారం తీసి ఉండటంతో ఇంటి యజమానులు వచ్చుంటారని వారిని పిలిచారు. ఎంతకీ రాకపోయేసరికి అప్పటికే ప్రధాన ద్వారం కాస్తా తేడాగా ఛిద్రమై కనిపించడంతో అనుమానం వచ్చి పక్కింటివారిని పిలిచారు. వారు వెంటనే ఫోన్‌లో రమాదేవికి సమాచారం అందించగా ఆమదాలవలసలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న తన సోదరికి ఫిర్యాదు చేయమని చెప్పడంతో ఆమె పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ గుండుమోను ఈశ్వరరావు క్లూస్ టీంతో ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. రెండు బెడ్ రూముల్లో ఉన్న బీరువాలు, అల్మారాలు తెరిచి ఉండటం, బట్టలన్నీ చిందరవందరగా పడేసి ఉండటం చూసి చోరీ భారీగానే జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. సమీపంలో ఉన్న సీసీపుటేజీలో డేటాను, ఆధారాలను సేకరించారు.

బెంగళూర్‌నుంచి రాత్రి 8:30గంటలకు చేరుకున్న ఉపాధ్యాయ దంపతులు ఇంటికెళ్లి అన్నీ పరిశీలించి వెంటనే రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఇంకా కేసు నమోదు చేయాల్సి ఉంది. చోరీ సొత్తు తెలియాల్సి ఉంది.

పోలీసుల ఇంటికే కన్నం

- సీఐ తండ్రి నివసిస్తున్న ఇంట్లో చోరీ
- పక్కనే హెడ్‌కానిస్టేబుల్ నివాసం

శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఏకంగా పోలీసు ఇంటికే కన్నం వేసి సవాల్ విసిరారు. రెండో పట్టణ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని పీఎన్ కాలనీ మూడో లైన్‌లో ఫ్లాట్ నంబర్ 3 గృహంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు బొడ్డేపల్లి రామారావు తన భార్యతో కలసి ఉంటున్నారు. ఈయన కుమారుడు సుధాకర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విశాఖపట్నంలో (భీమిలి) విధులు నిర్వర్తిస్తున్నారు. కుమార్తె కూడా ఉంది. పిల్లలకు వివాహాలు కావడంతో భార్యతో కలిసి రామారావు నగరంలోనే ఉంటున్నారు. విశాఖలో ఉన్న తన కుమారుడిని కలిసేందుకు ఈనెల 17న మధ్యాహ్నం 2:30 గంటలకు ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి రామారావు బయల్దేరి వెళ్లారు. రామారావు ఇంటికి తూర్పున జిల్లా డీసీఆర్బీలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ పాత్రుని వేణు నివాసముంది. ఈ క్రమంలో గురువారం ఉదయం రామారావు ఇంటికి ఉన్న తాళాలు విరగ్గొట్టడం చూసిన హెచ్‌సీ వేణు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి ఉండవచ్చనే అనుమానంతో వెంటనే రామారావుకు ఫోన్ చేసి రమ్మన్నారు. తక్షణమే ఇంటికొచ్చి రెండు బెడ్‌రూముల్లోని ఇనుప బీరువాలు తెరిచి చూడగా ఒక బీరువాలో రెండున్నర కిలోల వెండి వస్తువులు, అర తులం బంగారపు ముక్క చోరీకి గురవ్వడంతో నిర్ఘాంతపోయారు. వెంటనే రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ గుండుమోను ఈశ్వరరావు, క్లూస్‌టీంతో సహా వచ్చి పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.



రెండో బెడ్‌రూంలో బీరువా పరిశీలిస్తున్న సీఐ, క్లూస్ టీమ్

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్ ఆవరణలో ఉన్న యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో స్వయం ఉపాధి శిక్షణలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజనం సదుపాయాలు కల్పిస్తామన్నారు. 30 రోజుల ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు గల యువకులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, వివరాలకు ఫోన్ నంబర్ 9553410809, 7702180537ను సంప్రదించాలని కోరారు.

వేదవిద్య నిరుద్యోగులకు భృతిగా రూ.3 వేలు

అరసవల్లి: వేదవిద్య నేర్చుకుని నిరుద్యోగులుగా ఉన్న వారిలో అర్హులకు నిరుద్యోగ భృతిగా రూ.3 వేలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ బీఆర్‌వీవీ ప్రసాద్‌పట్నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో అర్హులెవరైనా ఉంటే ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా దేవదాయశాఖాధికారి కార్యాలయానికి దరఖాస్తులను అందజేయాలని తెలియజేశారు. అభ్యర్థి ఆధార్ కార్డు, వేదవిద్య అర్హత ధ్రువీకరణ, నిరుద్యోగితపై స్వీయ వాంగ్మూలం, బ్యాంక్ అకౌంట్ పుస్తకం తదితర ఒరిజినల్ ధ్రువీకరణ వివరాలతో దరఖాస్తులను సమర్పించాలని, మరిన్ని వివరాలకు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి అపాయింట్‌మెంట్ నిరాకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఏజీఎస్ మేనేజ్‌మెంట్‌కు వర్సిటీ అధికారులు గురువారం అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. దీంతో తాడేపల్లి ప్రాంతం నుంచి వచ్చిన వీరు నిరాశగా వెను తిరిగారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొమ్మిది నెలల వేతన బకాయిలపై గురువారం శ్రీకాకుళం కార్మిక శాఖ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. రెండు వారాల్లో వేతనాలు చెల్లించాలని అసిస్టెంట్ లేబర్ కమిషన్ ఆదేశించారు. ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ తమను కలవడం లేదని చెప్పిన అధికారులు, వర్సిటీకి వచ్చిన వారికి అపాయింట్ ఇవ్వక పోవటం గమనార్హం. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు లక్ష్యంగా అధికారులు ముందుకు వెళ్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నారు. మళ్లీ కార్మిక శాఖ కార్యాలయంలో అక్టోబర్ 19న విచారణ నిర్వహించనున్నారు.

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

ఆమదాలవలస: మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామచంద్రపురం పంచాయతీ పరిధిలోని ఆనందపురం కాలనీకి చెందిన వృద్ధుడు చింతాడ వెంకటరమణ తన భార్యతో కలిసి బుధవారం సాయంత్రం పాలకొండ వెళ్లి.. తిరుగు ప్రయాణంలో ఆమదాలవలసలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి(వైఎస్సార్‌కూడలి) వద్ద దిగారు. అక్కడి నుంచి పట్టణంలో ఉన్న తన కుమారుడి ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం వేచి చూస్తుండగా ఓ ఆటోలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి వీరిని బండిలో ఎక్కించుకున్నారు. కొంత దూరం వెళ్లాక వెంకటరమణ భార్య మెడలో ఉన్న సుమారు రెండు తులాల పావు పుస్తెలతాడును తస్కరించి తమను దారిలోనే విడిచిపెట్టి వెళ్లిపోయారని బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.